క్లుప్తంగా

సూర్యగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు క్యూ కట్టారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



17వ డివిజన్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 17వ డివిజన్‌లో సీసీరోడ్డు పనులను మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి స్థానిక కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. సీసీ, బీటీలతో పాటు యూజీడీలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ సాయిరాం, నాయకులు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ కృష్ణారెడ్డి, బాల్‌నింగని జంగయ్య, టేకుల శశిధర్‌రెడ్డి, వంగేటి కొండల్‌రెడ్డి, తూళ్ల నరహరిగౌడ్, టేకుల సుధాకర్‌రెడ్డి, ఇక్కె శ్రీనివాస్, రాఘవరెడ్డి, సుధాకర్, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

బాలాపూర్‌లో గణేశ్ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో ఏర్పాటు చేయనున్న గణనాథుని ఉత్సవాల నేపథ్యంలో రోడ్డు పనులు, పార్కింగ్ ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. మేయర్ చిగురింత పారిజాత, బాలాపూర్ స్టేషన్ సీఐ భూపతి, కమిషనర్ రఘు, డీఈఈ జ్యోతిరెడ్డి తదితరులు తనిఖీ చేశారు. వినాయక చవితి కంటే ముందే ఏర్పాట్లు పూర్తి చేస్తామని మేయర్ పారిజాత వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, ఏఈఈ సాయిరాం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, నాయకులు జగన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం చేయొద్దు

సరూర్‌నగర్ కార్పొరేటర్ శ్రీవాణి



హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు అన్యాయం చేయవద్దని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైడ్రా ఒక డ్రామా కాదు అని అంటే సల్కమ్ చెరువులో ఒవైసీ బ్రదర్స్ నిర్మించిన కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.బడా బాబుల అక్రమాలు, భూకబ్జాలు వదిలి పేదల జోలికి రావొద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరామని తెలిపారు.

హైడ్రాకు హ్యాట్సాఫ్

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



హుడాకాంప్లెక్స్: నగరంలోని చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలపై ప్రభుత్వం హైడ్రా ద్వారా ఉక్కుపాదం మోపడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిజాయితీ గల అధికారి ఆధ్వర్యంలో హైడ్రా చెరువుల్లోని ఆక్రమణలను తొలగిస్తూ తన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వహిస్తోందని తెలిపారు. గతంలో అవినీతికి పాల్పడ్డ మాజీ మంత్రులు అవాక్కులు, చెవాక్కులు పేల్చుతున్నారన్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాతనే చర్యలు తీసుకుంటున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిబద్ధతకు నిదర్శనమన్నారు. హైడ్రాతో మంచి పని చేస్తున్న ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు.



కంప చెట్లతో మూసుకుపోయిన కందుకూరు- మాలగూడూరు రహదారి



గూడూరు లింక్ రోడ్డు దుస్థితి

లింక్ రోడ్లు.. ప్రయాణానికి పాట్లు

- ముళ్ల చెట్లతో మూసుకుపోతున్న ఫార్మాసిటీ లింక్ దారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కందుకూరు: ప్రధాన రహదారి పైకి చేరుకునేలా నిర్మించిన గ్రామాల లింక్ రోడ్ల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. దీంతో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు మొలచి అధ్వానంగా మారుతున్నాయి. వాటి గుండా ప్రయాణం చేయాలంటే తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. అయినా సంబంధిత అధికారులు కేవలం ప్రధాన రహదారిని మాత్రమే పట్టించుకుంటూ గ్రామాల లింక్ రహదారుల నిర్వహణ వదిలేస్తున్నారు. ఇదీ మండల పరిధిలోని గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఫార్మా రహదారి దుస్థితి.

200 అడుగుల విస్తీర్ణంలో..

గత ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటులో భాగంగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మండల పరిధిలోని కొత్తూర్ గేట్ శ్రీశైలం రహదారి నుంచి పది కిలోమీటర్ల మేర వావిళ్లకుంటతండా వరకు 200 అడుగుల విస్తీర్ణంతో రోడ్డును నిర్మించింది. మధ్యలో గూడూరు, కందుకూరు, మాలగూడూరు, అన్నోజిగూడ తదితర గ్రామాల రహదారులు కలిసే చోట అండర్‌పాస్‌ల నిర్మాణాలతో పాటు ప్రధాన రహదారి పైకి చేరుకునేలా, తిరిగి కిందికి దిగేలా ఇరువైపులా లింక్ రోడ్లను ఏర్పాటు చేశారు. కాగా ప్రధాన రహదారిని అధికారులు సక్రమంగానే నిర్వహిస్తున్నారు. అండర్ పాస్‌ల పక్క నుంచి పైకి వెళ్లేలా నిర్మించిన లింక్ రహదారులను మాత్రం విస్మరించారు. దీంతో అవి అధ్వానంగా మారాయి. ఆ రహదారులకు ఇరువైపులా కంప చెట్లు మొలచి రాకపోకలకు ఆటంకంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేసి ఫోర్త్ సిటీ ఏర్పాటు చేయనుండటంతో ఆ రహదారికి ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీ మైత్రితోనే కవితకు బెయిల్

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: బీజేపీ మద్దతుతోనే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ మంగళవారం ఆరోపించారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనన్నారు. దానిని నిదర్శనమే కవితకు బెయిల్ రావడం అన్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతు ఇవ్వడంతో 8 ఎంపీ స్థానాలు కాషాయ పార్టీ గెలుపొందిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని రాష్ట్రాల ప్రభుత్వాధినేతల అవినీతిపై విచారణ జరుగుతుందని కేఎల్లార్ స్పష్టం చేశారు.

ఆర్థికసాయం అందజేత

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామానికి చెందిన దార ఆగమయ్య గిరిజ దంపతుల నివాసం మూడు నెలల క్రితం విద్యుదాఘాతంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ దంపతులకు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం కింద మంజూరైన రూ.95 వేల చెక్కును మున్సిపాలిటీ కేంద్రంలోని ఆయన కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారి కుటుంబానికి తమ ట్రస్టు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: బాధితులకు చెక్కును అందజేస్తున్న కేఎల్లార్

ఓటర్ జాబితాపై బీఎల్‌ఓలకు అవగాహన

ఇబ్రహీంపట్నం: ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులుంటే సరిచేయాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బూత్ లెవెల్ ఆఫీసర్స్ కు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించాలని, అడ్రస్సుల మార్పులు, చేర్పులను అక్టోబర్ 18 వరకూ పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయించిన తేదీలను బట్టి రెండు శనివారాలు, రెండు ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చి వేయాలి

బీజేపీ నాయకుడు శంకర్‌రెడ్డి

మీర్‌పేట: ఎంఐఎం నేతలు అక్రమంగా చెరువులను కబ్జా చేసి నిర్మించిన కట్టడాలను హైడ్రా ద్వారా ప్రభుత్వం వెంటనే కూల్చి వేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మీర్‌పేట జిల్లెలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే బీజేపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రభుత్వం హైడ్రా పేరిట కాలయాపన చేస్తోందన్నారు. అదే విధంగా మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత కిచ్చనగారి లక్ష్మారెడ్డి ప్రభుత్వ కార్యక్రమాల్లో తలదూరుస్తూ ఆటంకం కలిగిస్తున్నారని, అధికారులు తన మాటే వినాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడని శంకర్‌రెడ్డి ఆరోపించారు. సమావేశంలో బీజేపీ మీర్‌పేట ప్రధాన కార్యదర్శులు సోమేశ్వర్, గాజుల మధు, శ్యామ్‌రాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి



సరూర్‌నగర్ డివిజన్‌లోని పంజాల అనిల్‌కుమార్ కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి తృతీయ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి - హుడాకాంప్లెక్స్

సీఎం చేతుల మీదుగా చెక్కు

జయకృష్ణను అభినందించిన గ్రామస్తులు

మహేశ్వరం: యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్‌లో ప్రతిభ కనబరిచి మెయిన్స్‌కు అర్హత సాధించిన గడ్డమీది జయకృష్ణను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం అభినందించారు. మండల పరిధిలోని తుమ్మలూరుకు చెందిన జయకృష్ణకు రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద రూ.లక్షల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామస్తులు జయకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యాదగిరి, శ్రీశైలం, లింగారెడ్డి, చోటు, కార్తీక్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జయకృష్ణకు చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సేవాలాల్ సేన కార్యదర్శిగా లక్పతినాయక్

కడ్తాల్: సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శిగా మండల పరిధిలోని పోచమ్మగడ్డ తండాకు చెందిన జర్పుల లక్పతినాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిన్నవేములోని బావితండాకు చెందిన పత్యానాయక్ నియమితులయ్యారు. మంగళవారం జనగాం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంకల్పసభలో సేవాలాల్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబునాయక్ వారికి నియామక పత్రం అందజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం లక్పతినాయక్, పత్యానాయక్‌లను పలువురు సేవాలాల్ సేన నాయకులు సన్మానించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని ఉన్నటువంటి మూసీ ప్రాంతం బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ.. మహానగరంలో బఫర్ జోన్‌లో కబ్జాలకు గురైన వాటిపై హైడ్రా తీసుకుంటున్న చర్యలపై కార్పొరేటర్ పవన్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని తెలంగాణ పార్క్ శ్రీ రామలింగేశ్వర కాలనీ పక్కన సుమారు 3 ఎకరాల 12 గుంటల ప్రభుత్వ స్థలం ఉండేదని, కేవలం 19 గుంటలు మాత్రమే మిగిలిందన్నారు.ఆక్రమణలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు.



రంగనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం

- గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా
- రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కడ్తాల్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజమని, విశ్రాంత ఉద్యోగులు సమాజ సేవలో పాల్గొనాలని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా పేర్కొన్నారు. మంగళవారం హన్మానాయక్ ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో రవీందర్‌రెడ్డి చదువుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రవీందర్‌రెడ్డి అరుణ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ .గ్రామంలో మొట్టమొదటగా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి 30 సంవత్సరాలుగా రవీందర్‌రెడ్డి అనేక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారన్నారు. వారందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. విధినిర్వహణలో కష్టపడే ఉపాధ్యాయులకు సమాజంలో తగిన గౌరవం, గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జంగారెడ్డి, చేగూరి వెంకటేశ్, యాదగిరిరెడ్డి, జహంగీర్‌అలీ, లక్ష్మయ్య, కేశవులు, రాజేందర్‌రెడ్డి, ఆంజనేయులు, పాండు, రామకృష్ణ, చందోజీ, సత్యం యాదవ్, జహంగీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

రైతు గోస..!

రుణమాఫీ తెచ్చిన తంటా!

- రేషన్ కార్డు లింకుతో వర్తించని మాఫీ
- 19,219 మంది రైతులకు గాను కేవలం 3,572 మందికే..
- రైతువేదికలో దరఖాస్తులు ఇస్తున్న కర్షకులు
- సర్వే చేసి పరిశీలిస్తామని బదులిస్తున్న వ్యవసాయ శాఖ
- ఆందోళనలో అన్నదాతలు



రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయాధికారులు

యాచారం: రైతాంగాన్ని రుణమాఫీ గోస వెంటాడుతోంది. రూ.2 లక్షల్లోపు రుణాలు మొత్తం మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి సర్కార్ హామీ ఇచ్చింది. అప్పులు ఇచ్చిన బ్యాంకుల వద్దకు వెళ్లి వివరాలు అడిగితే మాత్రం పొంతన లేని నిబంధనల వల్ల రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2018 డిసెంబర్ 12 నుంచి, 2023 డిసెంబర్ 9, వరకూ రుణాలు పొందిన రైతులందరికీ (కుటుంబంతో కలిపి) రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన 19,219 మంది రైతులు ఉన్నారు. అందులో 12,500 మందికి పైగా యాచారం పీఏసీఎస్‌తో పాటు యాచారం, మీరాఖాన్‌పేట, మాల్, నందివనపర్తి గ్రామాల్లోని ఎస్‌బీఐ, మాల్‌లోని యూనియన్ బ్యాంకు, నక్కర్తమేడిపల్లిలోని ఇండియన్ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. ఈ రైతులంతా 2014 నుంచి రుణాలు పొంది, కొందరు ప్రతి యేటా రెన్యువల్ చేసుకోకపోవడం, మరికొందరు ఎన్నికలు వస్తే అధికారంలోకొచ్చే ప్రభుత్వాలు మాఫీ చేస్తాయనే ఆశతో రెన్యువల్ కూడా చేసుకోలేదు. ఆయా గ్రామాల్లోని బ్యాంకు సిబ్బంది రెన్యువల్ లేదా తీసుకున్న అప్పు చెల్లించమంటూ పలుమార్లు గ్రామసభలు పెట్టి చైతన్య పరిచిన వారిలో చలనం లేదు. రుణాలు కట్టలేదు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రూ. 2లక్షల వరకూ మాఫీ చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు గతంలో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోలేదు.

3,572 మందికే మాఫీ..

యాచారం మండలంలోని 24 గ్రామాల్లో మూడు విడతల్లో కేవలం 3,572 మందికే మాఫీ వర్తించింది. 3,572 మంది రైతులకు రూ. 27,80,49,914లు మాఫీ చేశారు. మండలంలోని 24 గ్రామాల్లో 12,500 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. వివిధ బ్యాంకుల్లో 5 వేల మందికి పైగా రూ. లక్షన్నర లోపు రుణాలు పొందిన వారున్నారు. కొన్ని బ్యాంకుల మేనేజర్లు రుణమాఫీ వివరాలు నింబంధనల ప్రకారం ఉన్నతాధికారులకు పంపకపోవడంతో రైతాంగానికి పెద్ద శాపంగా మారింది. యాచారం పీఏసీఎస్‌లో వెయ్యి మందికి పైగా అర్హత కలిగిన రైతులున్నప్పటికీ సరైన నింబంధనలు పాటించకపోవడంతో మాఫీ చేయలేదు. దీంతో వారు నిత్యం పీఏసీఎస్, ఆయా బ్యాంకుల వద్దకు వెళ్తున్నారు. అక్కడ పొంతనలేని నింబంధనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. యాచారం పీఏసీఎస్, యాచారం, మాల్ ఎస్‌బీఐ, నక్కర్తమేడిపల్లి ఇండియన్ బ్యాంకుల్లోని రైతులు రుణమాఫీ కాక పోవడంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ దరఖాస్తులు..

రుణమాఫీ కాని రైతులు ఆశతో మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ యాచారం రైతువేదికలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఆ కేంద్రంలో 1,063 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. రుణమాఫీ కాని రైతులతో రైతువేదిక నిత్యం కిటకిటలాడుతుంది. రుణమాఫీకి అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు లేకపోవడం, బ్యాంకు ఖాతాలో ఒక పేరు ఉండి ఆధార్‌లో మరో పేరు, రేషన్ కార్డు ఉన్నవారికి పట్టాదారు, పాసుపుస్తకాల్లో పేర్లు సక్రమంగా ఉండకపోవడం, ఆధార్ కార్డుల్లో సరైన వివరాలు లేకపోవడంతో మాఫీ వర్తించలేదు. ఇలా పలు నిబంధనలతో రుణమాఫీ కాని రైతులు మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

కడ్తాల్: మండల కేంద్రంలోని సత్యసాయి మందిరంలో లోక కల్యాణార్థం లలితాపరమేశ్వరి యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు స్త్రీ శక్తి లలితాంబిక బృందం , సాయి మందిర దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. 28న దేవాలయ ప్రవేశం, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షబంధనం, దీక్షాధారణ, శోడశ స్తంభ పూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, కలశస్థాపన, అర్చన, హారతి, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి, నవగ్రహ యంత్ర మూల మంత్రహావనం, జలాధివాసం 29న మండపారాధన, హోమాలు, జలాధివాస హోమం, మంత్ర పుష్పం, చండిహోమం, ధాన్యాధివాసం, ప్రదోషకాల పూజ, హారతి, 30న స్థాపిత దేవతా మండపారాధన, మాల మంత్ర హోమాలు, అధివాస హోమాలు, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, దిక్పాలక బలి, మహాపూర్ణాహుతి, అవబృత స్నానం ఆశీర్వచనములు, అనంతరం రాత్రికి అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మంగళవారం ఆలయం వద్ద ఏర్పాట్లను మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, జంగారెడ్డి, ఎలికంటి జ్ఞాన ప్రసూనాంబ శర్మ తదితరులు పరిశీలించారు.

ఇద్దరికీ మాఫీ కాలేదు



నేను, నా భార్య పాసుపుస్తకాలను యాచారం ఎస్‌బీఐలో పెట్టి రూ. మూడున్నర లక్షల పంట రుణం తీసుకున్నాం. కానీ కుటుంబంలో ఒక్కరికే రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని సర్కార్ చెప్పింది. ఇద్దరిలో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. యాచారం రైతు వేదికలో అధికారులను అడిగితే సరైన వివరాలు చెప్పడం లేదు.

– గుర్రం రఘుమారెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

హామీ మేరకు చేయాలి



కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి. కానీ రుణమాఫీకి నిబంధనలు పెట్టడంతో మాఫీ సక్రమంగా అమలు కావడంలేదు. యాచారం ఎస్‌బీఐలో రూ. లక్షన్నర రుణం తీసుకున్నాను. మాఫీ కాలేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే ఏవో నిబంధనలు చెబుతున్నారు. సర్కార్ హామీ ఇచ్చినట్లు రూ.2 లక్షల్లోపు రుణాలు మొత్తం మాఫీ చేయాల్సిందే.

– గౌర నర్సింహ, రైతు చౌదర్‌పల్లి

దరఖాస్తుల ఆధారంగా సర్వే



యాచారం మండలంలోని పలు గ్రామాల నుంచి రుణమాఫీ కాలేదని చాల మంది రైతులు దరఖాస్తులు చేస్తున్నారు. నిత్యం 200 మందికి పైగా వస్తున్నారు. దరఖాస్తులు ఇస్తున్నారు. వాటిని పరిశీలిస్తే రేషన్ కార్డు, ఆధార్ కార్డుల్లో, పట్టాదారు, పాసుపుస్తకాల్లో పేర్ల తప్పుల వల్ల మాఫీ కాలేదని తెలుస్తుంది. దరఖాస్తుల ఆధారంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కుటుంబ నిర్ధారణ సర్వే చేస్తాం.

– రవినాథ్, మండల వ్యవసాయాధికారి, యాచారం